క్లుప్తంగా

నాగేంద్రస్వామికి కోటి పుష్పార్చన

గీసుకొండ : మండలంలోని ఊకల్ హవేలిలోని సుప్రసిద్ధ ఆలయంలోని నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహానికి అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష మంగళవారం కోటి మల్లెలతో పుష్పార్చన నిర్వహించారు. హన్మకొండకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, మట్టివాడ సీఐ గోపీ దంపతులకు ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదం అందించారు.

డాక్టరేట్



గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌కు చెందిన తాళ్లపెల్లి రాజేశ్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రావు పర్యవేక్షణలో సమర్పించిన 'హైబ్రిడ్ క్లస్టరింగ్ అప్రోచ్ ఫర్ టైమ్ సిరీస్ డాటా' సిద్ధాంత గ్రంధానికి జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రకటించింది. ఈ మేరకు జేఎన్‌టీయూ పరీక్షల మూల్యాంకన సంచాలకురాలు డాక్టర్ అరుణకుమారి ఒక ప్రకటనలో వెల్లడించారు. రాజేశ్ హైదరాబాద్‌లోని జి.నారాయణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

సభ్యత్వ నమోదు

నర్సంపేట రూరల్ : మండలంలోని నర్సంపేట, లక్నేపల్లి, గురిజాల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆ యూనియన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు శానా ఉమామహేశ్వర్, మండల మండల అధ్యక్షుడు పోరెడ్డి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి కోడం సాంబయ్య, మండల అసోసియేట్ అధ్యక్షుడు లక్‌పతి, మండల కార్యదర్శి శీలం మల్లయ్య, జిల్లా కార్యదర్శి నాగేందర్‌సింగ్ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

పర్వతగిరి : మండలంలోని కల్లెడ గ్రామ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్నపాక శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా నక్క రాజు, కార్యదర్శిగా బుర్కి రవికుమార్, కోశాధికారిగా యాసరపు సురేశ్, దాసరి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడారు. సంఘం అభివృద్ధికి, అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటు పడతామని తెలిపారు.

'ఇంటర్‌సిటీ' హాల్టింగ్ కొనసాగించాలి

నెక్కొండ : స్థానిక రైల్వేస్టేషన్‌లో ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ కొనసాగించాలని కోరుతూ స్టేషన్ సూపరిండెంట్ ఉమేశ్ కుమార్‌కు రైల్వే ఫోరం సభ్యులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సభ్యులు మాట్లాడారు. ఇంటర్‌సిటీ హాల్టింగ్ రద్దు చేయడం ఏంటని ప్రశ్నించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సభ్యులు గోరంట్ల వెంకట్ నారాయణ, బక్కి అశోక్, మారం రాము, పెండ్యాల హరిప్రసాద్, కొణిజేటి భిక్షపతి, మెట్టు నర్సింహారెడ్డి, తదితరులున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

గీసుకొండ : వరంగల్‌లోని క్రిస్టియన్ కాలనీ సమీపంలోని తెలంగాణ జంక్షన్ వద్ద ఆగస్టు 6న ప్రజాయుద్ధ నౌక గద్దర్, ఉర్దూ దినపత్రిక ఎడిటర్ జహీరుద్దీన్ అలీ ఖాన్, తదితరుల యాది సభకు సంబంధించిన కరపత్రాలను గ్రేటర్ వరంగల్ పరిధిలోని ధర్మారంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉద్యమకారుడు కొమ్ముల సురేందర్, సామాజిక ప్రజాకవులు, కళాకారుల స్మారక కమిటీ రాష్ట్ర కన్వీనర్ గడ్డం శరత్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నేతి (బుల్లెట్) వెంకన్న మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేందర్, శరత్, వెంకన్న మాట్లాడారు. సభను విజయవంతం చేయాలని కోరారు.

ఆగస్టు 2న ప్రవేశ పరీక్ష

నెక్కొండ : మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో 6 నుంచి 8వ తరగతుల వరకు వివిధ కేటగిరీల్లో ఉన్న ఖాళీల భర్తీ కోసం ఆగస్టు 2న ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ మమత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 7, 7వ తరగతిలో 3, 8వ తరగతిలో 5 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఆగస్టు 1న సాయంత్రం 4 గంటలలోపు పాఠశాలలో దరఖాస్తు అందజేయాలని తెలిపారు.

కొత్త సభ్యులకు పంట రుణాలు ఇవ్వాలి

చెన్నారావుపేట : సహకార సంఘంలో కొత్తగా చేరిన సభ్యులకు వెంటనే రుణాలు ఇవ్వాలని మాజీ ఎంపీపీ జక్క అశోక్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించింది. అనంతరం అశోక్ మాట్లాడారు. స్థానిక సొసైటీలో 2012–13 ఆర్థిక సంవత్సరంలో 3786 మంది రైతులు కొత్తగా సభ్యత్వం తీసుకున్నారని చెప్పారు. 2012 నుంచి సభ్యత్వం కలిగిన రైతులకు రుణాలు ఇవ్వకపోవడంతో రుణమాఫీ వర్తించకుండా నష్టం జరిగిందని ఆందోళన వెలిబుచ్చారు. సభ్యత్వం కలిగిన అందరికీ వెంటనే రుణాలు మంజూరు చేయాలని కోరారు.

అవగాహనతో హక్కుల సద్వినియోగం

పర్వతగిరి : అవగాహన కలిగి ఉండడం ద్వారానే పౌరహక్కులను సద్వినియోగం చేసుకోగలమని తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కల్లెడలోని ఎస్సీ కాలనీలో మంగళవారం నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకూ సమాన హక్కులున్నాయని చెప్పారు. హక్కులను ఎవరు ఉల్లంఘించినా, వివక్ష పాటించినా చట్టరీత్యా శిక్షార్హులని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ పాక శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చిన్నపాక శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముదురుకోల రమేశ్, కాంగ్రెస్ నాయకులు దండంపెల్లి సైదులు, చినపాక వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

గరీబ్‌నగర్‌లో..

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్‌లోని గరీబ్‌నగర్‌లో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ రియాజుద్దీన్ మాట్లాడారు. సదస్సులో ఎస్సీ, ఎస్టీ కమిషన్ జిల్లా సభ్యుడు నమిండ్ల చిన్నస్వామి, స్థానిక పెద్దలు సంజీవ, నారాయణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరు.. సదస్సు బహిష్కరణ

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయిలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన సదస్సుకు డిప్యూటీ తహసీల్దార్ ఉమాదేవి తప్ప ఇతర అధికారులు హాజరు కాకపోవడంతో సదస్సును దళితసంఘాల నాయకులు బొట్ల నరేశ్, బట్టు సాంబయ్య, నాగరాజు, గ్రామస్తులు బహిష్కరించి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అధికారులు హాజరు కావాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశించినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కుమారస్వామి, రాజు, మల్లయ్య, సారయ్య, రాజేందర్, ప్రమోద్, సమ్మక్క, సరోజన తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి : సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్



గీసుకొండ : మాట్లాడుతున్న తహసీల్దార్



దుగ్గొండి : నిరసన తెలుపుతున్న నాయకులు, గ్రామస్తులు

రుణాల రెన్యువల్‌లో అక్రమాలు

- రుణమాఫీ అర్హత కోల్పోయిన రైతులు

నల్లబెల్లి : అధికారులు, పాలకవర్గం పర్యవేక్షణ లోపంతో నల్లబెల్లి పీఏసీఎస్‌లో పంట రుణాల రెన్యువల్‌లో అక్రమాలు ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చాయి. వ్యవసాయ శాఖ అధికారులు సహకారం అందించడంతో సిబ్బంది అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని మండలంలో జోరుగా చర్చ సాగుతుంది. నల్లబెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులు డీసీసీ బ్యాంక్‌లో పంట రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం పంట రుణాలను మాఫీ చేస్తుందని భావించిన వారు క్రమం తప్పకుండా రెన్యూవల్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రైతులకు సంబంధించిన ఆధార్, పట్టా పాస్ బుక్ తదితర వివరాలు సిబ్బంది ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. ఆధార్ కార్డు నంబర్లు రైతుల నుంచి సేకరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పీఏసీఎస్ సిబ్బంది స్థానిక వ్యవసాయ అధికారులను ఆశ్రయించారు. రైతులకు సంబంధిత ఆధార్ నంబర్లు కావాలని కోరడంతో రైతుబంధుకు సంబంధించిన వివరాలను అందించారు. వ్యవసాయ శాఖ అధికారుల నుంచి తీసుకున్న ఆధార్ నంబర్లు పూర్తి స్థాయిలో సరి చేయకుండా ఇంటి పేరు, పేరు ఒకేలా ఉన్న వారి పంట రుణాలకు ఇతరుల ఆధార్ వివరాలు ఆన్‌లైన్ చేశారు. కానీ ఇవేమీ పట్టించుకోని డీసీసీ బ్యాంక్ అధికారులు పంట రుణాలు, పంట రుణాల రెన్యూవల్ ప్రక్రియను కొనసాగించారు. దీంతో పంట రుణాలకు సంబంధం లేని రైతులకు ప్రభుత్వం మాఫీ చేసినట్లు ఎస్ఎంఎస్‌లు వస్తున్నాయి. రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతుల ఆధార్ నంబర్ ఇతరుల బ్యాంక్ ఖాతాకు అనుసంధానం చేయడంతో రూ.లక్షకు పైగా అప్పు ఉందని రికార్డులో చూపడంతో వీరికి మాఫీ వర్తించకుండా పోయింది. విషయం తెలుసుకున్న బాధిత రైతులు ఒకొక్కరుగా నల్లబెల్లి ప్రాథమిక సహకార సంఘం వద్దకు చేరుకుని సిబ్బందిని, పాలకవర్గాన్ని నిలదీస్తున్నారు.



నిలదీస్తున్న బాధిత రైతు కుటుంబ సభ్యులు

మాఫీ అయ్యేలా చూడాలి



నర్సంపేట స్టేట్ బ్యాంక్‌లో క్రాప్‌లోన్ తీసున్నా.. గతేడాది డిసెంబర్ 12వ తేది నాటికి రూ.55,297 బకాయి ఉంది. ప్రభుత్వం రూ.లక్షలోపు అప్పు మాఫీ చేసింది. కానీ మాకు రాలేదు. నాకు నల్లబెల్లి పీఏసీఎస్‌లో సభ్యత్వమే లేకుండా రుణం ఎలా ఉంటుంది. ఆధార్ కార్డు తప్పుగా నమోదు చేయడంతో ఇలా జరిగిందని చెప్పారు. మాఫీ అయ్యేలా చూడాలి

– భూక్య సునీత, మహిళా రైతు, నందిగామ

'తిథి భోజన్'లో భాగస్వాములు కావాలి



నల్లబెల్లి : అరటి పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న వైనాల అశోక్, నాయకులు

నల్లబెల్లి : ప్రభుత్వం చేపట్టిన తిథి భోజన్ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్ కోరారు. తిథి భోజన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నారక్కపేట హైస్కూల్ విద్యార్థులకు గ్రామానికి చెందిన శ్రీపతి సుమన్ మంగళవారం అరటి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ మాజీ చైర్మన్ కొందూరి రాయసాబ్, మాజీ ఉపసర్పంచ్ వడ్లూరి రమేశ్, హెచ్ఎం సుధాకర్‌రావు, ఉపాధ్యాయులు దామోదర్, నీలిమ, సుధాకర్, వినోద, ఆశవర్కర్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు విద్యార్థులకు పోషక విలువ ఉన్న లడ్డూలు అందించారు. అనంతరం హెచ్ఎం రామస్వామి మాట్లాడారు. విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుశీల, సంధ్యారాణి, విజయలక్ష్మి, కరుణ, అరుణ, జుమ్మీలాల్, జనార్దన్, మహేశ్, అహ్మద్, అజీజ్, మధుసూదన్, ఐలయ్య పాల్గొన్నారు.



దుగ్గొండి : లడ్డూలు అందిస్తున్న ఉపాధ్యాయులు

పర్వతగిరి : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో మహంకాళి రామస్వామి అతడి తల్లి ఎల్లమ్మ స్మారకార్థం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల నోడల్ ఆఫీసర్ జి.లింగారెడ్డి మాట్లాడారు. వ్యక్తులు జన్మదినం, ఇతర ముఖ్యమైన రోజుల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన వేళ పండ్లు, స్వీట్లు, పోషక పదార్థాలు అందిస్తే ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బొట్ల గీత, హెచ్ఎంలు పాక రమేశ్ బాబు, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

1,540 మందికి రుణమాఫీ

సంగెం : మండలంలో 1,540 మంది రైతులకు రుణమాఫీ వర్తించింది. కాగా కాపుల కనపర్తి సొసైటీలోని 1,907 మంది రైతులకు రుణమాఫీ అమలు కాలేదు. ఆడిటింగ్ వల్ల రుణమాఫీ ఆలస్యం అవుతోందని సొసైటీ అధికారులు భరోసా ఇచ్చినా రైతులు ఆందోళన చెందుతున్నారు. 13 గ్రామాల్లోని రైతులకు, ఇతర వాణిజ్య బ్యాంకుల్లో పంట రుణం తీసుకున్న వారికి మాఫీ జరగడంతో (ఐఓబీ) ప్రస్తుతం ఇండియన్ బ్యాంకు పరిధిలోని తమకు రుణమాఫీ అవుతుందో లేదోనని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

మాకెందుకు అయితలేదు



'రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ అవుతుండగా మాకెందుకు అయితలేదు' అని కాత్రపల్లికి చెందిన మహిళా రైతు బొల్ల దేవమ్మ అధికారులను ప్రశ్నించారు. తాను కాపుల కనపర్తి సొసైటీలో పంట రుణం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. ఆడిటింగ్ వల్ల జాప్యం అవుతోందని అధికారులు చెబుతున్నా అవుతుందో కాదో తెలియడం లేదని ఆమె వాపోయారు.

1,864 మందికి..

గీసుకొండ : మండలంలో 1,864 మంది రైతులకు రూ.1.50 లక్షలు చొప్పున రెండో విడత రుణమాఫీ వర్తించిందని ఏఓ హరిప్రసాద్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో డబ్బు జమ అవుతుందని పేర్కొన్నారు. అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయడంలో చొరవ తీసుకుంటున్నట్లు వివరించారు.

బురదమయం.. అధికారుల నిర్లక్ష్యం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బురద



కుంటను తలపిస్తున్న నాచినపల్లిలోని రోడ్డు

దుగ్గొండి : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ రహదారులు బురదమయం అయ్యాయి. తహసీల్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోనూ నీరు నిలిచి బురదమయం కాగా కార్యాలయానికి వచ్చే ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. కాగా బురదమయం అయిన ప్రాంతాల్లో మట్టి పోయించడం, వర్షపు నీరు నిల్వకుండా చూడడం లాంటి పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బురదతో వరి పొలాన్ని తలపిస్తోంది. కార్యాలయంలోకి వెళ్లాలంటే చెప్పులు చేత పట్టుకోవాల్సి వస్తోందని ప్రజలు, రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. కార్యాలయం ఎదుట కూడా శుభ్రం చేసుకోకపోతే ఎలా అంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక నాచినపల్లిలోని మినీ బ్యాంక్ వద్ద 100 మీటర్ల మేర వర్షపునీటితో నిండి రహదారి చిన్ననాటి కుంటను తలపిస్తోంది. మోకాలి లోతు నీటిలో రాకపోకలు సాగించడం దుర్భరంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు నిర్లక్ష్యం వీడి వర్షాకాలంలో కార్యాలయాల ఆవరణల్లో, గ్రామాల్లోని రహదారుల్లో బురదమయం కాకుండా, వర్షపు నీరు నిల్వకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించాలి



ధర్నా చేస్తున్న నాయకులు, గుడిసెవాసులు

చెన్నారావుపేట : మండలంలోని అమీన్‌పేట శివారులోని పనికర గుట్ట సమీపంలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అక్కలపెల్లి రమేశ్, మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఎస్సై గూడ అరుణ అక్కడకు చేరుకుని గుడిసెవాసులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. అనంతరం తహసీల్దార్ ఫణికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్, చెన్నకేశవులు మాట్లాడారు. పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకుని ఏడేళ్లుగా నివాసం ఉంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుసుకుల దేవపాల, నీరటి రజిత, మైదం యాకయ్య, చిలకపల్లి శ్రీను, ఫయాజ్, వీరస్వామి, వీరయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం



నల్లబెల్లి : మండల కేంద్రంలో మంగళవారం క్షుద్రపూజల కలకలం చోటు చేసుకుంది. హైస్కూల్‌లోని హెచ్ఎం కార్యాలయం ఎదుట గుర్తు తెలియని వ్యక్తులు పసుపు, కుంకుమ, నిమ్మకాలు, కొబ్బరికాయలు వేశారు. మొదటి అంతస్తులో మద్యం సేవించి బాటిళ్లను పడేశారు. ఉపాధ్యాయులు సమాచారం అందించడంతో ఎస్సై ప్రశాంత్ బాబు పాఠశాలకు చేరుకుని పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఎస్సై మాట్లాడారు. క్షుద్రపూజలు, మూఢవిశ్వాసాలను నమ్మొద్దని చెప్పారు.

'ముదిరాజ్'లపై రాజకీయ పార్టీల నిర్లక్ష్యం

- మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్



మాట్లాడుతున్న అశోక్

దుగ్గొండి : ముదిరాజ్ కులస్తుల పట్ల రాజకీయ పార్టీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ తెలిపారు. జనాభా పరంగా ఎక్కువగా ఉన్నప్పటికీ రాజకీయ, ఇతర అవకాశాలు సరైన రీతిలో కల్పించడం లేదని ఆయన చెప్పారు. ముదిరాజ్ కులస్తులను బీసీ'ఏ'లో చేర్చాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం నిరసనా ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రవిచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో ముదిరాజ్ కులస్తులు 13 శాతం ఉన్నట్టు తెలిపారు. రాజకీయ పార్టీలు ముదిరాజ్ కులస్తులను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. శాసనసభ, పార్లమెంట్, రాజ్యసభతోపాటు నామినేటెడ్ పదవుల్లోనూ రాజకీయ పార్టీలూ సరైన వాటా ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కులస్తుల అన్ని సమస్యలనూ సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహాసభ జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి, ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, నాయకులు సోమన్న, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



నెక్కొండ : స్థానిక ఎంపీడీఓగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన వీరేశ్‌ను సతీసమేతంగా మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు మంగళవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యాలయ సూపరింటెండెంట్ దయాకర్ మాట్లాడారు. వీరేశ్ నిబద్ధతతో విధులు నిర్వర్తించారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీఓ సునీల్ రాజ్, పీఆర్ ఏఈ రాజ్‌కుమార్, ఏపీఓ జాకబ్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గుంటూరుపల్లి గ్రామ అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఎస్‌కే.యాకూబీని మాజీ సర్పంచ్ కర్నాటి పార్వతమ్మ, గ్రామస్తులు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. మాజీ సర్పంచ్ పార్వతమ్మ మాట్లాడారు. యాకూబీ అంగన్‌వాడీ టీచర్‌గా ఎనలేని సేవలు అందించారని అభినందించారు.

బదిలీ అయిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌కు..

పర్వతగిరి : స్థానిక వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ నరేశ్‌ను బదిలీ అయిన సందర్భంగా మండల కేంద్రంలో సిబ్బంది సన్మానించారు. అనంతరం నరేశ్ మాట్లాడారు. విధినిర్వహణలో సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్, డాక్టర్ రాజు, అమరావతి, యాకేశ్, విజేందర్, కుమార్, వెంకన్న పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

నర్సంపేట రూరల్ : ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సంపేటలోని ద్వారకపేట రోడ్డులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన నాగమల్ల రమేశ్ భార్య స్వాతి (35) భర్తకు అప్పులు కావడంతో మనస్తాపం చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. భోజనం చేసేందుకు వచ్చిన భర్త స్వాతి ఉరేసుకుని ఉండడాన్ని గుర్తించడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమణమూర్తి తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు.

జీవితంలో ఆరోగ్య పరిరక్షణ కీలకం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సుప్రియ సర్వేశ్

- సీఎస్ఐ గ్రూప్ చైర్‌పర్సన్ సుప్రియ సర్వేశ్

చెన్నారావుపేట : జీవితంలో ఆరోగ్య పరిరక్షణ కీలకమని సీఎస్ఐ వరంగల్ గ్రూప్ చైర్‌పర్సన్ సుప్రియ సర్వేశ్, డాక్టర్ స్వరూప స్పష్టం చేశారు. మండలంలోని సూర్యపేటతండాలో సీఎస్ఐ వరంగల్ గ్రూప్ చర్చి కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని స్పష్టం చేశారు. జ్వరం, ఇతర అనారోగ్య పరిస్థితులు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. తొలుత పలువురికి కంటి, సీజనల్ వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డయాసిస్ మినిస్టీరియల్ కన్వీనర్ పాల్, సహోదర్, డికెన్ దీపక్, డికెన్ జోసఫ్ కిశోర్, వరంగల్ గ్రూప్ సెక్రెటరీ ఆకుల అశోక్, డాక్టర్ తేజస్వి, డాక్టర్ సంజీవరావు, లయన్ డాక్టర్ ఉషా మార్త, రిబ్కా జాన్, స్టాఫ్ నర్స్ స్వరూపరాణి, ఏఎన్ఎం లలిత, జయంతి, హెలెన్, ప్రేమలత, శాంతమ్మ, సరోజ, సుజాత, శరత్ ఐ హాస్పిటల్ టీమ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ రిజర్వేషన్‌ను మండలిలో ప్రస్తావించండి



నర్సంపేట : ముదిరాజ్ రిజర్వేషన్ అంశాన్ని శాసనమండలిలో ప్రస్తావించాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను హైదరాబాద్‌లోని క్యూ న్యూస్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం దేవేందర్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొట్లపల్లి సంజీవన్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బోయిని జగన్‌మోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి



చెన్నారావుపేట : తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగస్వాములైన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లాడి వీరారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో నాయకులు మండల కేంద్రంలోని వివేకనంద విగ్రహానికి మంగళవారం వినతిపత్రం అందించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడారు. ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 250 గజాల భూమి, రూ.25 వేల పెన్షన్, గుర్తింపు కార్డు, బస్‌పాస్ అందించాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి కొడగాని రాజేరు, మండల అధ్యక్షుడు ఉప్పునూతుల లింగమూర్తి, మహిళ విభాగం అధ్యక్షురాలు బండారి మంజుల, నాయకులు నూకల ముత్తయ్య, రాజు, లక్ష్మణ్, వీరాసింగ్, గణేశ్, చక్రునాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల అరెస్ట్, విడుదల

ఖానాపురం : నిరసన తెలిపేందుకు హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఆశవర్కర్లను పోలీసులు అరెస్ట్ చేసి తదనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు ఆశవర్కర్లకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఆశవర్కర్లను అరెస్ట్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో విజయ, సంధ్య, స్వరూప, కవిత, అరుణ, రజిత, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఉద్యోగ అవకాశాలు

పర్వతగిరి/సంగెం/దుగ్గొండి : పర్వతగిరి, సంగెం, దుగ్గొండి కేజీబీవీల్లో నైట్ వాచ్ ఉమెన్, స్వీపర్, స్కావెంజర్, హెడ్‌కుక్ ఉద్యోగాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓలు సత్యనారాయణ, విజయ్‌కుమార్, నోడల్ అధికారి గాయపు లింగారెడ్డి, దుగ్గొండి హెచ్ఎం మంజుల ప్రకటనల్లో తెలిపారు. మండలానికి చెందిన వారై 18 నుంచి 45 ఏళ్ల నడుమ వయస్సున్న మహిళలు అర్హులని పేర్కొన్నారు. నైట్ వాచ్ ఉమెన్, హెడ్ కుక్ పోస్టులకు పదోవ తరగతి, స్వీపర్, స్కావెంజర్ పోస్టులకు ఏడో తరగతి పాసై ఉండాలన్నారు. ఆగస్టు 4 సాయంత్రం 4 గంటలలోపు కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మోడల్ స్కూల్‌లో..

సంగెం : మండలంలోని మోడల్ స్కూల్‌లోని బాలికల వసతి గృహంలో హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ విజయ్‌కుమార్ తెలిపారు. హెడ్‌కుక్‌కు పదో తరగతి, అసిస్టెంట్ కుక్‌కు 7వ తరగతి చదివి ఉన్న మహిళలు ఆగస్టు 2న సాయంత్రం 4 గంటల వరకు మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.